క్లుప్తంగా

నివాళి



రుక్మాంగధ రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. పుత్తూరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.టి.ప్రసాద్ సోదరుడు రుక్మాంగధరెడ్డి ఆకస్మికంగా మృతి చెందారు. గురువారం మంత్రి రోజా వారి ఇంటికి వెళ్లి రుక్మాంగధరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్ర, శంకర్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

24న ఆర్జిత కల్యాణోత్సవం

నగరి : మండలంలోని బుగ్గఅగ్రహారం గ్రామంలో టీటీడీ ఆధీనంలో ఉన్న కాశీవిశ్వేశ్వరాలయంలో ఈ నెల 24వ తేదీన ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ తెలిపారు. ఇందులో పాల్గొనాలనుకునే భక్తులు రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్ రెడ్డి భరోసా ఇచ్చారు. వడమాలపేట మండలం ఎస్బీఆర్‌పురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్రమణ్యం యాదవ్ గురువారం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అదాలత్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: అదాలత్‌లో వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. గురువారం తిరుపతి నుంచి విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఈ కార్యాలయం నుంచి అధికారులు పాల్గొన్నారు. గత నెల 8న పెనుమూరులో నిర్వహించిన విద్యుత్ అదాలత్‌లో పేరుమార్పు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ మార్పు, కేబుల్ మార్పు వంటి పది సమస్యలు వచ్చాయని ఈఈ తెలియజేశారు. అందులో 7 సమస్యలను పరిష్కారించామన్నారు. మిగిలిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు సమస్యలను నెలరోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. డీఈ జ్ఞానేశ్వర్, జేఏఓ గోవిందరాజులు, ఏఈ మాధురి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసుల కొట్టివేత



హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి సిటీ: తెలుగుదేశం ప్రభుత్వంలో 2017లో ఎస్వీయూ రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన దేవరాజులనాయుడి అవినీతి, అక్రమాలపై గళమెత్తిన వైఎస్‌ఆర్ సీపీ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాలపై నమోదైన అక్రమ కేసులను గురువారం తిరుపతి 4వ ఏడీజే న్యాయస్థానం కొట్టివేసింది. ఈ సందర్భంగా వర్సిటీలో ఆ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అక్రమంగా నాడు టీడీపీ ప్రభుత్వం తమపై నిరాధారమైన కేసులు మోపిందన్నారు. వైఎస్ఆర్ సీపీ విద్యార్థి నాయకుడు వి.హరిప్రసాద్‌రెడ్డి, పోతు మురళీధర్, పి హేమంత్‌కుమార్‌రెడ్డి, డీజే సుధీర్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు శివారెడ్డి, చలపతి, శశి, ఏఐవైఎఫ్ కత్తి, రవి, ఎన్ఎస్‌యూఐ అమృతేజ, వసీం అక్రమ్‌తో పాటు 21మందిపై నమోదైన కేసులను కొట్టివేశారు.

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టండి

- అసాంఘిక శక్తులను పోషిస్తోంది టీడీపీనే
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి
- జగనన్న ఆశయ సాధనకు కృషి చేస్తా : జీడీ నెల్లూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కృపాలక్ష్మి
- తండ్రి, తనయకు అడుగడుగునా మంగళ హారతులతో స్వాగతం



ఎన్నికల ప్రచారంలో జీడీనెల్లూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి కృపాలక్ష్మికి బ్రహ్మరథం పడుతున్న మహిళలు

శ్రీరంగరాజపురం: సంక్షేమ సారథి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టడానికి మహిళలు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని పుల్లూరు, పద్మాపురం, ఏఎంపురం, ఎస్సార్‌ఆర్‌పురం, సచివాలయ పరిధిలోని గ్రామాల్లో జీడీనెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మితో కలసి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగనన్నకు మరోసారి పట్టం కట్టడానికి మహిళలు ఆనందంగా ఉన్నారని అన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన అందించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రతి సామాజిక అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత కూడా జగనన్నదేనని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను గ్రామాల్లోకి తీసుకొచ్చి ప్రజల ముంగిట సేవలు అందించిన ఘనత కూడా జగనన్నకే దక్కుతుందన్నారు. చంద్రబాబు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తూ విధ్వంస కాండకు అడుగులు వేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒకటి అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. మళ్లీ అధికారం కోసమే అమలు చేయలేని హామీలతో ప్రజలను నమ్మించడానికి వస్తున్నారని, అందరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

మీ ఆడబిడ్డగా ఆదరించండి..

సీఎం జగన్న ఆశయాలతో, నా తండ్రి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మీ ఆడబిడ్డగా ఆదరించాలని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. గురువారం పలు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయా గ్రామాల్లో నాయకులు క్రేన్ల సాయంతో గజమాలు వేసి వారికి స్వాగతం పలికారు. అలాగే మహిళలు ఇంటింటా మంగళహారతులు పట్టి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం కృపాలక్ష్మి మాట్లాడుతూ మంచిని ఓడించడానికి పొత్తులతో వస్తున్న డబుల్ ఇంజిన్ పార్టీలను నమ్మి మోసపోవద్దని, 5 ఏళ్ల పాటు సంక్షేమ ఫలాలు అందించి ఆదరించిన జగనన్నను గుర్తు పెట్టుకుని మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని అభ్యర్థించారు. తన తండ్రి బాటలో నడుచుకుంటూ ప్రతి అడుగు ప్రజల కోసమే వేస్తానని తెలిపారు. అలాగే పులూరు గ్రామానికి చెందిన మహిళలు తమకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరడంతో స్పందించిన కృపాలక్ష్మి ఎన్నికలయ్యాక వెంటనే మీ అందరికీ ఇంటి నిర్మాణాలు చేపట్టేలా కృషి చేస్తానని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను వందశాతం పూర్తి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు, యువత ఆనందంతో మంత్రి నారాయణస్వామితో పాటు కృపాలక్ష్మిపై పెద్దఎత్తున పూలవర్షం కురిపించి అరు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మణి, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, స్థానిక సర్పంచులు కుమారి, మల్లికమ్మ, హరిత, దిలీప్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, వైస్ ఎంపీపీ లోకనాథరాజు, ఎంపీటీసీ సభ్యులు చంద్రప్రకాష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, విజయాబాబు, నాయకులు జనార్ధన్, బాబు, యోగానందం, అమృతరాజు, వెంకటేష్, వాసు, హరిరెడ్డి, రాజేంద్రన్, యుగంధర్, భాస్కర్‌రెడ్డి, ప్రమీళ, కుప్పయ్య, చిన్నబ్బ పాల్గొన్నారు.





ఉపముఖ్యమంత్రి నారాయణస్వామితో కలసి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, జేసీబీతో కృపాలక్ష్మిపై పూల వర్షం కురిపిస్తున్న యువత

వృషభ వాహనంపై కరకంఠేశ్వరుడు

నగరి : పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కరకంఠేశ్వర స్వామిని నంది వాహనంపై దర్శనమిచ్చారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా రూ.1.80 లక్షల వ్యయంతో నూతన వృషభ (నంది) వాహనాన్ని ఆలయానికి అందించారు. ఆ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో అభిషేక, అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఊరేగింపుగా వచ్చిన స్వామివారికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమానికి చంద్రారెడ్డి, వెంకటరత్నం రెడ్డి, బీడీ భాస్కర్, ఇందారెడ్డి, మునికృష్ణారెడ్డి, రమేష్ రెడ్డి, గిరిజాకుమారి, సూర్యారెడ్డి, ఎల్లప్పరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు.



వృషభ వాహనంపై కరకంఠేశ్వరుడు

పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ కృష్ణవేణి

నింద్ర: ప్రతి ఒక్కరూ ఆహార పరిశుభ్రత పాటించాలని నగరి సీడీపీఓ కృష్ణవేణి అన్నారు. గురువారం మండలంలోని ఇరుగువాయి గ్రామం దళితవాడలో పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచి షోషకాలు ఉన్న ఆహారం ఇవ్వడంతో పాటు పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఈ నెల 23వ తేదీ వరకు ఆహార పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి



తమిళనాడు సరిహద్దులో వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ భారతి

పాలసముద్రం : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటును ప్రశాంత వాతావరణంలో నిర్భయంగా వేయాలని ఎస్‌ఐ భారతి తెలిపారు. గురువారం ఆమె బలిజకండ్రిగలో ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా ప్రశాంతంగా పోలింగ్ జరుగుతుందని, ప్రజలంతా తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లను ఎవరూ ప్రలోభాలకు గురిచేయరాదన్నారు. ఓటును అమ్ముకోకుండా సరైన నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు. ఓటర్లను ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తమిళనాడు సరిహద్దులో వాహనాలు తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మురుగేష్, చక్రవర్తి, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేద్దాం



పెనుమూరులో ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేసి జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ప్రచార రథాన్ని ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా 2024 ఎన్నికల్లో జగన్.. వన్స్‌మోర్ నినాదంతో కార్యకర్తలు ఉత్సాహంగా ముందుకు వెళ్లారు. అదే విధంగా సీఎం జగనన్న అన్ని సామాజిక వర్గాలకు 5 ఏళ్లపాటు అందించి సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి మళ్లీ గుర్తు చేసి ప్రతి ఇంటిపై మరోసారి జగనన్న జెండా ఎగుర వేసేందుకు సిద్ధంగా ఉండేలా ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. టీడీపీ నాయకుల అక్రమాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే పెనుమూరు మండలంలో ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, గంగాధరనెల్లూరు నియోజకవర్గం అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి చేపట్టే ప్రచారంలో ప్రతి కార్యకర్త, నాయకుడు, ప్రజాప్రతినిధులు, మహిళలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, కొల్లుమోహన్, భీమేశ్వర్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

తిరుపతి కల్చరల్: ఏర్పేడు మండలం, కోబాక గ్రామ పంచాయతీ మిట్ట, ఎస్సీ ఎరుక కాలనీలోని తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకుంటూ తమను బెదిరిస్తున్న ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఎస్టీ కాలనీకి చెందిన బాధితులు జి.రామసుబ్బమ్మ, జి.వెంకటేశ్వర్లు, నాగయ్య మాట్లాడారు. ఏర్పేడు మండలం, కోబాక గ్రామ పంచాయతీ మిట్టలో 15 కుటుంబాలు నివాసముంటూ బతుకుతున్నామన్నారు. ఇదే కాలనీలో 40 ఏళ్ల క్రితం వెంకటయ్య కుటుంబం భూమి లేకపోయినా గుడిసెలు వేసుకుని ఉండేవారని, అయితే ఉద్యోగ రీత్యా గ్రామం వదలి వెళ్లిపోయారన్నారు. అయితే కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వెంకటయ్య కుమారుడు అరుణ్ కాలనీలోని తమ నివాస స్థలాలను దౌర్జన్యంగా కబ్జా చేసి ఆక్రమించుకుంటున్నారని, దీనిపై ప్రశ్నించిన తమపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళితే రెవెన్యూ అధికారులు వచ్చి పరిశీలించి కాలనీలో భూమి ఆక్రమణను అరికట్టేందుకు ప్రయత్నించినా ఎదురు దాడికి దిగుతూ బెదిరిస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఏప్రిల్‌లో కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి: చంద్రగిరిలో వెలసిన శ్రీకోదండరామ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 17 నుండి 25వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 16వ తేదీ సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఏప్రిల్ 17వ తేదీ ఉదయం 9.05 నుండి 10 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు శ్రీకోదండ రామస్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఏప్రిల్ 23వ తేదీ ఉదయం 10 నుండి 11.30 గంటల వరకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. రూ.750 చెల్లించి గృహస్తులు(ఇద్దరు) కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు గరుడ వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. ఏప్రిల్ 25వ తేదీ ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సర్లకు, చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం, ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు చక్రస్నానం వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఏప్రిల్ 26వ తేదీ ఉదయం 9 నుండి 10.15 గంటల వరకు శ్రీరామపట్టాభిషేకం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో హరికథలు, భజనలు, సంగీత కచేరీలు నిర్వహించనున్నారు.

పార్కింగ్ స్థలం వేలం వాయిదా

కాణిపాకం: కాణిపాకం పంచాయతీలోని పార్కింగ్ స్థలం గుత్త హక్కుల వేలాన్ని వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి సత్యంరెడ్డి తెలిపారు. ఈ నెల 26న కాణిపాకం పార్కింగ్ స్థలాన్ని వేలం వేయాల్సి ఉందని, అనివార్య కారణాలతో నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రామకుప్పం: మండలంలోని రాజుపేట గ్రామ సమీపంలో గురువారం ఉదయం కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఆయన కథనం..శాంతిపురం మండలానికి చెందిన మహేష్ 300 టెట్రా ప్యాకెట్లు,7 బీరు బాటిళ్లతో ద్విచక్రవాహనంలో వెళ్తుండగా తనిఖీలో పోలీసులకు పట్టుబడ్డాడు. బైక్‌తో సహా మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.25వేలు ఉంటుందని ఎస్‌ఐ చెప్పారు.

సంక్షేమ ఫలాలతో ప్రతి ఇంటా సంతోషం



టీసీ అగ్రహారంలో ప్రచారం నిర్వహిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి, నాయకులు

- ఎన్నికల ప్రచారంలో రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి అండగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం వడమాలపేట మండలం టీసీ అగ్రహారం సచివాలయ పరిధిలోని కల్లూరు పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తాము సైతం సిద్ధం అంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల ముందు జగనన్న చేపట్టిన పాదయాత్రలో మహిళా సంఘ సభ్యులను రుణ విముక్తులను చేస్తానని ఇచ్చిన హామీని, నెరవేర్చారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 7.97 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని 78.76 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు, 4 విడతల్లో రూ.25,570 కోట్లు మాఫీ చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. 2014లో మహిళలకు రుణమాఫీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ తర్వాత మోసం చేసిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో మళ్లీ మోసం చేయడానికి చంద్రబాబు ప్యాకేజీ స్టార్లతో జత కట్టి తప్పుడు హామీలు ఇస్తున్నారని ఆరోపించారు. నేటి ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి, అందించిన సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. జగనన్న సైనికురాలిగా పనిచేస్తున్న మంత్రి రోజమ్మను మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, గంగాధరం, వెంకటేష్, చెన్నయ్య, సుబ్రమణ్యంరెడ్డి, నందయ్య, ఉపేంద్రరాజు, సురేష్‌రాజు, వెంకట్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఇరగారెడ్డి, శేఖర్, మునిబాబు, రమేష్, ఉమాపతి, లోకేష్, కమల, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారానికి తాము సిద్ధం అంటూ జత కట్టిన మహిళలు

ప్రాణం ఉన్నంత వరకు వైఎస్సార్‌సీపీతోనే..

- బలవంతంగా కండువా వేసి శునకానందం పొందకండి
- టీడీపీ నేతలకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రాజు హెచ్చరిక

కార్వేటినగరం: నా ప్రాణం పోయేంతవరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటా.. సీఎం జగనన్న, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామితోనే నా పయనం అంటూ సురేంద్రనగరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రాజు అన్నారు. గురువారం సురేంద్రనగరంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి కోసం కాంగ్రెస్‌కు పని చేశామన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి నేటి వరకు జననేత జగనన్నతోనే పయనిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కోసం ప్రాణాలు అర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని గుర్తు చేశారు. టీడీపీ నాయకులు తనపై కక్ష సాధింపు కోసం టీడీపీ జెండాను బలవంతంగా కప్పి టీడీపీలో చేరినట్లు ప్రకటిస్తూ శునకానందం పొందుతున్నారని ఆరోపించారు. 'నేను.. నా కుటుంబం ప్రాణాలతో ఉన్నంతవరకు వైఎస్సార్‌సీపీ కోసం పని చేస్తామని, బలవంతంగా కండువాలు వేసినంత మాత్రనా ఒరిగిపోయేదేమీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి తమకు అవమానం కలిగేలా, టీడీపీలో చేరినట్లు కండువాలు కప్పినా తమ గుండెల్లో జగనన్నకు మాత్రమే స్థానం ఉంటుందని హెచ్చరించారు.





దారిలో వెళ్తున్న ప్రభాకర్‌రాజుకు కండువా వేస్తున్న టీడీపీ నాయకుడు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని సన్మానిస్తున్న ప్రభాకర్‌రాజు

గ్రామకంఠం భూమిని కాపాడండి



డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రామానాయుడుపల్లి గ్రామస్తులు

గంగాధర నెల్లూరు: మండలంలోని రామానాయుడిపల్లిలోని నాలుగు సెంట్ల గ్రామకంఠం భూమిని కొందరు వారి స్వప్రయోజనాల కోసం కబ్జా చేశారని గ్రామస్తులు ఆరోపించారు. గురువారం వారు గ్రామకంఠం కబ్జాపై డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రామానాయుడుపల్లి దళితవాడలో గ్రామం నడిబొడ్డున సర్వే నంబర్ 80లో నాలుగు సెంట్లు భూమిని గత 100 ఏళ్లుగా గ్రామ అవసరాల కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. ఇదే స్థలంలో గంగమ్మ జాతర కూడా నిర్వహిస్తున్నామని విన్నవించారు. అయితే ప్రస్తుతం అదే గ్రామానికి చెందిన పొన్నుస్వామి, కుటుంబ సభ్యులు ఈ భూమిని కబ్జా చేస్తున్నారని వినతిపత్రంలో వివరించారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

సామాజిక చైతన్య గొంతుక



నాగలి కూడా ఆయుధమే కవితా సంపుటి పుస్తకాన్ని పరిచయం చేస్తున్న అతిథులు, వక్తలు

- నాగలి కూడా ఆయుధమే పుస్తక పరిచయ కార్యక్రమంలో వక్తలు ఉద్ఘాటన

తిరుపతి కల్చరల్: సమకాలీన సామాజిక చైతన్య గొంతుకగా నాగలి కూడా ఆయుధమే పుస్తకం నిలుస్తుందని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. ఈ తరం కవితా వేదిక ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం యూత్ హాస్టల్లో కవి కొమ్మవరపు విల్సన్‌రావు కవితా సంపుటి అయిన నాగలి కూడా ఆయుధమే పుస్తకం పరిచయ సభ ఘనంగా నిర్వహించారు. ఈ తరం కవితా వేదిక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్వేత డైరెక్టర్ భూమన్, పుస్తక సమీక్షకుడిగా ఓఆర్‌ఐ డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, విశిష్టత అతిథిగా మహిళా వర్సిటీ తెలుగు శాఖాధిపతి డాక్టర్ వై.సుభాషిణి హాజరయ్యారు. నాగలి కూడా ఆయుధమే పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ సందర్భంగా సమకాలీన సామాజిక వాస్తవిక అంశాలు, మానవీయ విలువలపై మాట్లాడిన కవిత్వంగా వారు పేర్కొన్నారు. భూమన్ మాట్లాడుతూ మానవ చైతన్యాన్ని కాంక్షిస్తున్న కవిగా విల్సన్‌ను అభివర్ణించారు. డాక్టర్ వై.సుభాషిణి మాట్లాడుతూ అమానవీయత మీద ఎక్కుపెట్టిన కవితాస్త్రంగా నాగలి కూడా ఆయుధమే పుస్తకమని తెలియజేశారు. పుస్తక సమీక్షకుడు పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాగలి కూడా ఆయుధమే పుస్తకంలోని కవిత్వాన్ని, కవి రచనా శైలిని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా రచయితలు ఆర్‌సీ కృష్ణస్వామి రాజు, పల్లిపట్టు నాగరాజు, డాక్టర్ కొత్వాలు అమరేంద్ర హాజరు కాగా పలువురు సాహితీ వేత్తలు, రచయితలు సాకం నాగరాజు, డాక్టర్ రాసాని, మూరిశెట్టి గోవింద్, డాక్టర్ మన్నవ గంగాధర్, ఆకుల మల్లేశ్వరరావు, ఆచార్య దామోదరనాయుడు, అంకమనాయుడు పాల్గొన్నారు.

యోగా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా కోర్సులకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ డాక్టర్ జీవనజ్యోతి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స ర్టిఫికెట్ యోగా కోర్సుకు కనీస విద్యార్హత పదవతరగతి, తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలని చెప్పారు. 16 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. డిప్లొమా కోర్సుకు ఇంటర్, తత్సమాన కోర్సు ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. సర్టిఫికెట్ కోర్సు 6 నెలలు, డిప్లొమా కోర్సు ఏడాది కాల వ్యవధి ఉంటుందని చెప్పారు. ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9441555990, 9182420973 నంబర్లలో సంప్రదించవచ్చని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.